యువత కోసం రాజీవ్ యువ వికాసం

- 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 6 నుంచి పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న మంజూరు పత్రాలు
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.ఆరు వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడారు. యువత వికాసాన్ని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదనీ, ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్లను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.మూడు లక్షల చొప్పున సాయం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సంవత్సరం స్వయం ఉపాధి పథకం అందించడానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. స్వయం ఉపాధి పథకం కొరకు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ ఆరు నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తామని వివరించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తగిన మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తున్నారని చెప్పారు.

చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి రూ.540 కోట్లు

చాకలి ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం రూ.540 కోట్లు కేటాయించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ డిజైన్ చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీలో ఉన్న హెరిటేజ్ భవనాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం మూసీ రివర్‌ను ఆనుకుని ఉందని మూసీ పునర్జీవం అయిన తర్వాత యూనివర్సిటీ ప్రధాన ద్వారాన్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు రూ.15.5 కోట్లు, అదే విధంగా నూతన భవన నిర్మాణాలకు తక్షణమే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్టు డిప్యూటీ సిఎం వెల్లడించారు. హెరిటేజ్ భవనాలు, పునరుద్ధరణ ప్రణాళికలను అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా పరిశీలించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ హరీష్, ఐలమ్మ యూనివర్సిటీ విసి సూర్య ధనుజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 టాపర్ ఎన్‌వి హరవర్ధన్

- 447.088 మార్కులతో అగ్రస్థానం
- గ్రూప్-2 జిఆర్‌ఎల్ విడుదల : టిజిపిఎస్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 రాతపరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జిఆర్‌ఎల్)ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) మంగళవారం విడుదల చేసింది. గ్రూప్-2లో 447.088 మార్కులతో నారు వెంకట హరవర్ధన్ అగ్రస్థానంలో నిలిచారు. 444.754 మార్కులతో వడ్లకొండ సచిన్ రెండోస్థానంలో ఉన్నారు. 439.344 మార్కులను సాధించి బి మనోహర్‌రావు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మహిళల్లో 408.713 మార్కులను సాధించి ప్రథమ స్థానంలో ఉన్నారు. తొలి 500 ర్యాంకుల్లో మహిళలు కేవలం 48 మంది ఉన్నారు. కొన్ని కేటగిరీల్లో 360, 370 ఆపైన మార్కులు వచ్చిన అభ్యర్థులు ఆయా రిజర్వేషన్, జోన్లలో ఉద్యోగాలు పొందే అవకాశమున్నది. మంగళవారం టిజిపిఎస్‌సి పాలకమండలి సమావేశాన్ని చైర్మన్ బుర్రా వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం టిజిపిఎస్‌సి కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-2 పోస్టులకు 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారి కోసం గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 33 జిల్లాల్లో రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. వారిలో 2,49,964 మంది అభ్యర్థులు అన్ని పేపర్లకూ హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 2,36,649 మంది అభ్యర్థులు జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)కు అర్హత సాధించారని వివరించారు. అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను సంబంధిత అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. రాష్ట్రంలో 13,315 మంది అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలు చెల్లనివిగా ప్రకటించారు.

ఉద్యోగులకే ఉద్యోగాలు

గ్రూప్-2 జీఆర్‌ఎల్‌లో ఎక్కువ మంది ప్రస్తుత ఉద్యోగులే ఉన్నట్టు తెలిసింది. సోమవారం గ్రూప్-1 ఫలితాల్లో, మంగళవారం గ్రూప్-2 జీఆర్‌ఎల్‌లో ఎక్కువ మంది ప్రస్తుతం ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్-4 ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సింగరేణి, గురుకుల ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయులే ఉన్నారు. వారే ఎక్కువ మార్కులను సాధించారు. ఇంకోవైపు సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు కూడా ఎక్కువ మార్కులను సాధించి గ్రూప్-1, గ్రూప్-2కు ఎంపికైన వారిలో ఉన్నట్టు సమాచారం.

గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులకు విధి విధానాలు ఖరారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులకు సంబంధించిన విధి విధానాలు ఖరారయ్యాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ సినిమా రంగానికి విశేష సేవలనందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లపై ప్రత్యేక అవార్డులు ఇవ్వాలనీ, ప్రజాదరణ పొందిన చలన చిత్రాలకు ఇచ్చే ఎం.ప్రభాకర్ రెడ్డి అవార్డును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014 నుంచి 2023 వరకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను జారీ చేయకపోవడంతో, ఆ సంవత్సరాలకు కూడా ఒక్కో సంవత్సరానికి ఒక ఉత్తమ చలన చిత్రానికి అవార్డు నివ్వాలని నిర్ణయించారు. ఫీచర్ ఫిలిం క్యాటగిరీలో మొట్టమొదటి సారిగా ఉర్దూ భాషా చిత్రాలకు కూడా అవార్డులు ఇవ్వనున్నారు. గద్దర్ చలన చిత్ర అవార్డులకు సంబందించిన దరఖాస్తులు హైదరాబాద్ ఏ.సి గార్డ్స్‌లోని తెలంగాణా చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయంలో గురువారం నుంచి అందుబాటులో ఉంటాయి. గద్దర్ అవార్డులను ఈ క్రింది కాటగిరీలలో ఇవ్వనున్నట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

అవార్డుల కోసం క్యాటగిరీలు

ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యతపై చలన చిత్రం, బాలల చలన చిత్రం,పర్యావరణం/హెరిటేజ్/ చరిత్ర లపై చలన చిత్రం, డెబిట్ ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిలిం,సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్,డాక్యుమెంటరీ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్,

ఇతర క్యాటగిరీలు

తెలుగు సినిమాలపై బుక్స్/ విశ్లేషణాత్మక వ్యాసాలు,ఆర్టిస్టులు/ టెక్నీషియన్లకు వ్యక్తిగత అవార్డులు

సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు

కులదురహంకారులకు తగిన గుణపాఠం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు కులదురహంకారులకు గుణపాఠం చెబుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానం, పోలీసు అధికారుల కృషి వల్ల ఈ కేసులో న్యాయం గెలిచిందన్నారు. హంతకుడికి ఉరి శిక్ష, సహకరించిన వారికి యావజ్జీవ శిక్ష పడిందని చెప్పారు. ప్రణయ్ కుటుంబానికి రక్షణగా, దోషులకు శిక్ష పడే విధంగా పని చేసిన వారందరికీ ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. అయితే, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2017లో జరిగిన అంబోజు నరేష్, స్వాతి ఘటనలో పోలీసులుగానీ, ప్రభుత్వంగానీ సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల కేసు కోర్టులో కొట్టేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును హైకోర్టులో అప్పీలు చేసి, కేసు మిస్టరీని ఛేదించాలని డిమాండ్ చేశారు. రాష్టంలో 126 కులదురహంకార హత్యలు జరిగినా, కేసుల దర్యాప్తు విషయంలో ప్రణయ్ హత్య కేసులో తీసుకున్న జాగ్రత్తలు లేకపోవడం విచారకరమన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రజాసంఘాల మీదనే కాకుండా, ప్రజా ప్రతినిధులపై, ప్రభుత్వ యంత్రాంగంపై ఉన్నదని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, నాయకులు ఐతరాజు నర్సింహా, బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, మెట్టు నర్సింహా, పాలమాకుల అర్జున్, నలపరాజు శేఖర్ ఉన్నారు.

ధర్నా చేస్తున్న పసుపు రైతులు

పసుపునకు మద్దతు ధర కల్పించాలి

- రైతుల మహాధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పసుపునకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం రైతు ఐక్యవేదిక నాయకులు పసుపు రైతులతో కలిసి మహాధర్నా చేపట్టారు. ముందుగా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా రైతు ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసినా మద్దతు ధర దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా పసుపు క్వింటాల్ రూ.5 వేల ధర ఉండటం బాధాకరమని అన్నారు. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ప్రధాన పంట అయిన పసుపుకు మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర రూ.15వేలు కల్పించాలని, మార్కెట్ ఇంటర్వేషన్ స్కీమ్‌లో పసుపును కలపాలని కోరారు.

పొలం నుంచి రైతులు నేరుగా మాట్లాడొచ్చు

- యాంత్రీకరణలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం
- రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్, ట్రాక్టర్‌తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్స్ మొదలైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడి మీద అందివ్వాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ యాస్మిన్‌భాషాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి స్వయంగా పాల్గొన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతుల చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రాజేంద్రనగర్ పరిశోధన స్థానం నుంచి ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు వివరించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పద్ధతిలో వరి పంటకు నీరు అందించాలనీ, దీనివల్ల నీటి ఎద్దడిని అధిగమించడంతో పాటు, అధిక దిగుబడులు కూడా సాధించడానికి అవకాశముంటుందని సూచించారు. స్వల్పకాలిక వరి వంగడ రకాలను నవంబర్‌లోనే సాగుచేస్తే మార్చి మొదటి వారం వరకు వరికోతకు వచ్చే అవకాశముంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..శాస్త్రవేత్తలు చెప్పినట్టు రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుచేసుకుంటే నీటి ఎద్దడిని అధిగమించడంతో పాటు వడగళ్ల వర్షం వంటి విపత్తుల నుంచి వరి పంటను రక్షించుకోవచ్చునని రైతులకు సూచించారు. మార్క్ ఫెడ్ ద్వారా నిర్వహిస్తున్న జిన్నింగ్ మిల్లు నాలుగేండ్లుగా ఉపయోగంలో లేదనీ, ఈ ఏడాది జిన్నింగ్ పనిని ఆరంభించామని చెప్పారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న గోదాములు వంద శాతం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న కందులు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేండ్లుగా టీజీ సీడ్స్ నిర్వహణ సరిగా లేకపోవడంతో సంస్థ నష్టాల్లోకి వెళ్లిందని టీజీ సీడ్స్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన సీడ్స్‌ను రైతులకు సరసమైన ధరలో అందించగలిగామనీ, ఐదేండ్లుగా సీడ్స్‌ను నాన్‌సీడ్స్‌గా అమ్మినందుకే దాదాపు రూ.90 కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. సీడ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ద్వారా నాణ్యమైన సన్నరకాల విత్తనాలను రైతులకు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌కు మంత్రి తుమ్మల సూచించారు. కందులు, మినుములు, సన్ ఫ్లవర్, శనగలు మొదలైన పంటల విషయంలో నాణ్యమైన విత్తనాలను సీడ్ కార్పోరేషన్ ద్వారా అందించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పోరేషన్ ఎండి యాస్మిన్ బాషా, సీడ్ సర్టిఫికేషన్ ఎండి కేశవులు, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కేసు కొట్టేయండి

- హైకోర్టులో ఈటల పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో 2021లో జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేశారు. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, డిఫాక్టో ఫిర్యాదుదారు ఎన్ .విజయ్, కరీంనగర్ జిల్లా ఎల్కతుర్తి తహశీల్దార్‌కు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించి ఉప్పల్ గ్రామంలో బిజెపి కార్యకర్త తోట సురేష్ ఇంటికి ఈటల వెళ్లడంపై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. తనపై నమోదైన కేసు అక్రమమనీ, వెంటనే కొట్టివేయాలని కోరుతూ ఈటల దాఖలు చేసిన పిటిషన్ పై తదుపరి విచారణ ఏప్రిల్ ఒకటికి హైకోర్టు వాయిదా వేసింది.

దేశానికి రోల్ మోడల్ 'కొండపర్తి విలేజ్'

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి గ్రామం నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో గవర్నర్ పర్యటించారు. తొలుత కొమరం భీమ్, బిర్సాముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7,84,700తో నిర్మించిన మసాలా యూనిట్, రూ.7,76,594తో కుట్టు మిషన్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం రిమోట్‌తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. ఇది 70 గృహాలు, 285 మంది ప్రజలున్న చిన్న గ్రామమని, అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. తాను రాష్ట్రంలో ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నానని, వాటిల్లో ఈ గ్రామం ఒకటని, అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గుజరాత్‌లో అమూల్ ఏ విధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా యూనిట్లకు పేరు ప్రఖ్యాతలు రావాలని ఆకాంక్షించారు. గ్రామంలో రూ.1.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరూ ఆదివాసీ బిడ్డలమేనని చెప్పారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం సేవలను అభినందించారు. దట్టమైన అడవిలో రవాణా సౌకర్యం కూడా లేని ఈ గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకున్నట్టు తెలిపారు. ఈ గ్రామాన్ని బయట ప్రపంచంతో అనుసంధానం చేస్తూ ఉత్పత్తులను అందించాలని, తద్వారా మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని అన్నారు. గ్రామానికి అనతి కాలంలోనే రహదారి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి గవర్నర్ ఏడు బోర్లు మంజూరు చేశారని, దాంతో రెండు పంటలు పండించడానికి అవకాశం కలిగిందని అన్నారు. 40 పరిశ్రమలు, దిశా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 పాఠశాలలను దత్తత తీసుకున్నామని చెప్పారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు ఐకమత్యంతో ఉండాలని, అప్పుడు సమైక్యతతో అభివృద్ధి సాధిస్తామని తెలిపారు. అనంతరం గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల వ్యాపారాల నిర్వహణకు ప్రముఖ ప్రాంతంలో దుకాణాన్ని కేటాయించినట్టు తెలిపారు.

ఎంపి రఘునందన్‌రావుకు హైకోర్టులో ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన కేసులో మెదక్ పార్లమెంటు సభ్యులు ఎం రఘునందన్ రావుకు హైకోర్టులో ఊరట లభించింది. అధికార యంత్రాంగం నుంచి అనుమతి లేకుండానే నాగార్జున సాగర్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారంలో వుట్లపల్లి, పులిచెర్ల గ్రామాల్లో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని పెద్దవూర ఎంపీడీవో దుబ్బా శ్యామ్ చేసిన ఫిర్యాదు మేరకు 2021లో కేసు నమోదైంది. ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసులు విచారణ చేపట్టే ప్రత్యేక కోర్టులో కేసు విచారణలో ఉంది. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రఘునందన్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.లక్ష్మణ్ మంగళవారం విచారించారు. కింది కోర్టులోని కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో బీజేపీ నాయకునిపై ఉన్న కేసును కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

మీసేవ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఎనిమిది నెలల పిఎఫ్ బకాయిలను చెల్లించాలి
- మంత్రి శ్రీధర్‌బాబుకు తెలంగాణ మీసేవ ఎంప్లాయిస్ యూనియన్ వినతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మీసేవ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ మీసేవ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.సురేశ్, జెనీమా కోరారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆ యూనియన్ బృందం వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా జె.వెంకటేశ్ పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఎపిఎఆర్ (చిన్నపిల్లలకు ఆధార్‌కార్డు దరఖాస్తు), రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, విద్యార్థులకు ప్రత్యేకంగా మున్సిపల్ సేవలకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్లలో సవరణలు, తదితర సేవలతో మీసేవా సిబ్బందిపై మోయలేని పనిభారం పడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కేంద్రాల్లో అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. రెండేండ్లుగా వేతనాలు పెంచలేదని గుర్తుచేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వార్షిక బోనస్ ఇవ్వాలనీ, లేదంటే ఏటా ఇన్సెంటివ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మీసేవా కేంద్రాల్లో కష్టమర్లకు కనీససౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎబిబి లక్ష్మి, కవిత, బి.బాల్‌రాజ్ పాల్గొన్నారు.

అస్పష్టత ప్రశ్నకు మార్కులివ్వాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశ్నాపత్రంలో అస్పష్టత ఉన్న ఏడో ప్రశ్నకు విద్యార్థులకు పూర్తి మార్కులను ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం ఏడో ప్రశ్నలో పై డయాగ్రామ్‌ను పరిశీలించి సమాధానాలను రాయాలంటూ ఇంటర్‌బోర్డు పేర్కొందని వివరించారు. డయాగ్రామ్ కనిపించకుండా విద్యార్థులను గందరగోళానికి గురయ్యేలా చేసిందని తెలిపారు. అయితే ఆ ప్రశ్నకు జవాబు రాసేందుకు ప్రయత్నించిన విద్యార్థులకే మార్కులను ఇస్తామంటూ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రకటన తప్పును వెనకేసుకుని వచ్చేలా ఉందని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం ఉన్నందున ఆ ప్రశ్నకు ఉన్న నాలుగు మార్కులను పరీక్ష రాసిన విద్యార్థులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. మార్కులను కలిపి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనేక ఏండ్లుగా ఇంటర్ బోర్డు పరీక్షల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని తెలిపారు. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల తయారీ, ముద్రణ వంటి వాటిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

iN THE HONOURABLE COURT OF XIII TH ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE AT GAJUWAKA VISAKHAPATNAM
O.S. 89 of 2018

Between:
Kunaparaju Savithri ... Plaintiff
And:
To
7) Smt. Kallepalli Lakshmikumari
W/o. Subba Raju,
Nainatal 6A,
Satyam Hillcounti,
Nizampet Road,
Hyerabad.
Telangana state.
... Defendants

Please take notice that the above suit is posted on 28-03-2025 for your notice by way of substituted service of summons as ordered by the Honourable Court, vide its orders dt. **19-02-2025.** Therefore, you are informed by means of this notice that you have to appear in the above matter before the court at **10.30 A.M.** either in person or through an Advocate to answer the claims in the above suit, failing which the claim in the suit will be decided in your absence.

P.APPANNA
Advocate
48-3-45, Srinagar
Near Rama Talkies
Visakhapatnam-16
Cell: 9989334755
Visakahpatnam.
Visakhapatnam,
Dt. 11-03-2025

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KANDUKUR
O.S.No.670/2023

Kakarlapudi Sailaja & another - Plaintiffs
Versus
Lakkamraju Srinivasa Raju - Defendant

To,
Lakkamraju Srinivasa Raju,
S/o **Suraparaju, Business,**
R/o Balnepalli Village,
Adavidevulapalli Mandal,
Nalgonda District, Telangana State.

పై నెంబరున వాదులు మీ మీద దావా పరిహారము లకు డిక్రీ కోరుచూ దావా దాఖలు చేసినందుకు మీకు దావా సమను నిమిత్తం **తేది 07-04-2025** కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు **ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : **07-04-2025**
కందుకూరు.

వై.సాంబశివరావు
వాది తరుపు అడ్వకేటు, కందుకూరు,
ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా, ఏ.పి.

IN THE COURT OF THE HON'BLE 2nd SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT:: HYDERCABAD
O.S.No : 311 OF 2025

Between:
Smt. Pagadala Sridevi, W/o. Late Sri P.Vasudeva Rao, aged about 64 years, occ: Housewife, R/o. H.No.1-65/406/ Jyothi Emerald,Flat No.301, Jyothi Emerald Road, No-8 Kakatiya Hills, Madhapur, Hyderabad- 500 081.
...Plaintiff
AND
ALL CONCERNED & OTHERS
..Defendants

To,
All Concerned

Take notice all the concerned to the subject matter that the above plaintiff herein have filed the above suit declaring that she is the owner of half of the suit schedule property by virtue of the WILL-DEED dated 7th day of December 2023 executed by her late husband Sri Pagadala Vasudeva Rao S/o. Late P.Satyanaryana. The above case is posted to **09-06-2025** at **10.30** am, for the appearance of all concerned. Hence, any person is concerned to the subject matter are hereby directed to appear before the aforesaid Hon'ble court, failing which the matter will be decided on merits

Schedule of property

All that undivided half of the suit schedule property of bearing Municipal No.6-3-1093 Flat No.305, 4th & 5th Floor having super built up area of 1750 square feet with undivided share of land admeasuring 52.7 square yards or 44.0 square meters out of 5266 square yards or 4419 square meters, called as "VV Vintage Residency", Rajbhavan Road situated at Somajiguda, Hyderabad is bounded on: North: Corridor & Open South: Open East: Open & Flat No.304 West: Open

//BY ORDER OF THE COURT//
M.Nageswara Rao
Advocate
H.No.1-1-545/A, 1st floor
Flat No.102, Aditi Arcade
Gandhinagar, Hyderabad-020

పేదల భూములు కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్ర

- ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ఫార్మాసిటీపై సిఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- భూములను నిషేధిత జాబితాలో పెట్టడమే చట్టవిరుద్ధం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీ, ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫీల్డ్ రకరకాల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం పేద రైతుల భూములను గుంజుకొని కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్ర చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని, ఫార్మాసిటీపై సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టడమే చట్టవిరుద్ధమని, ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతుభరోసా, రుణాలు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం లోని కుర్మిద్ద గ్రామంలో యాచారం, కందుకూరు మండలాలకు చెందిన ఫార్మాసిటీ బాధిత రైతులతో జాన్‌వెస్లీ ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతుల తమ బాధలను ఆయన ముందు ఏకరువు పెట్టారు. అనంతరం రైతులను ఉద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో భూములను లాక్కొని రైతులకు తక్కువ పరిహారం చెల్లించి మోసం చేసిందన్నారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రైతులకిచ్చిన హామీని విస్మరించిందన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో వేలకోట్లు ఉన్న బడాబాబులు ఇక్కడికి వ్యాపారం చేయ డానికి వస్తే, ఈ ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు. భూములను గుంజుకొని అదే భూమిలో రైతులను కూలీలుగా మార్చే కుట్ర చేస్తోందన్నారు. ప్రతి రైతు కుటుంబానికీ 500 గజాల నుంచి 800 గజాల ప్లాట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూ చట్టాన్ని అమలు చేసి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయంతో పచ్చని పొలాలుగా వర్ధిల్లుతున్న ఈ ప్రాంతాన్ని విషతుల్యాన్ని నింపే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఏడు మండలాలు, 70 గ్రామాల్లో లక్షకు పైగా ఎకరాల భూ సేకరణ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రైతుల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

20, 21వ తేదీల్లో ఫార్మా గ్రామాల్లో సిపిఎం జీపు జాత

ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యలపై ఈ నెల 20, 21వ తేదీల్లో సిపిఎం ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. ఈ జాత ద్వారా కళాకారులతో రైతులను చైతన్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామని, కలెక్టర్ స్పందించి రైతులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. లేదంటే 21వ తేదీన రైతులతో పాదయాత్రగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు సిపిఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామ్‌చందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు పి బ్రహ్మయ్య, ఆలంపల్లి జంగయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ లీడర్లను నియమిస్తాం

- సభలో సమన్వయంతో ముందుకెళ్లాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కెసిఆర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ, మండలిలో ప్రజాసమస్యలపై ఇంకా ప్రతిభావంతంగా పోరాడేందుకు, సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్టు బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సిఎం కె చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కెసిఆర్ అధ్యక్షతన బిఆర్ఎస్ఎల్పీ సమావేశం మూడు గంటల పాటు జరిగింది. అందులో ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. బిఆర్ఎస్ శాసనసభ్యులు, మండలి సభ్యులు నిర్ణీత సమయానికే అసెంబ్లీకి రావాలని ఆదేశించారు. సభల్లో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపైనా, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపైనా చీల్చి చెండాడలని సూచించారు. బిఆర్ఎస్ మీద రాష్ట్ర సర్కారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎండిన పంటలు, అందని కరెంటు, సాగునీరు, కాలిపోతున్న మోటార్లు తదితర రైతాంగ సమస్యలపైనా, తాగునీటి కొరతపైనా సభలో లేవనెత్తాలని సూచించారు. బిసి రిజర్వేషన్లు, ఎస్‌సి రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయనీ, దీన్ని కూడా సభలో లేవనెత్తాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డిఎల పెండింగ్, పిఆర్‌సి అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలని సూచించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తోన్న మోసపూరిత వైఖరిని నిల దీయాలన్నారు. దళిత బంధు, గొర్రెలు, చేపల పంపిణీ పథకాలను నిలిపివే యడాన్ని ప్రశ్నించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, బిఆర్ఎస్‌కు చెందిన శాసనసభ, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు.

కనీస వేతనాల సవరణ గెజిట్లను ప్రచురించండి

- హైకోర్టు ఆదేశాలు వెంటనే అమలు పర్చాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కనీస వేతనాల గెజిట్‌లను రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల్లోగా విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వెంటనే వాటిని ప్రచురించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిామెంట్స్‌లలో పదేళ్లకుపైగా కనీస వేతనాల సవరణ జరగలేదనీ, దీనిపై కార్మిక సంఘాలు పోరాడుతున్నా రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం జీవోలు సవరించకుండా కార్మికులకు అన్యాయం చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు వేతనాలు పెంచకుండా డిఎలను కలిపి వేతనాలు పెంచినట్టు మొక్కుబడిగా కొన్ని ముసాయిదా గెజిట్‌లను ప్రచురించిందని తెలిపారు. కనీస వేతనాలు పెంచితే ప్రభుత్వాలపై పైసా భారం పడకున్నా ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తలకు అధిక లాభాలు గడించిపెట్టేందుకు కార్మికులకు వేతనాలు పెంచకుండా పొట్టగొడుతారా? అని నిలదీశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసవేతనాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన కార్మికులకు ప్రయోజనం చేకూరేలా కనీస వేతనాల జీవోలను సవరించాలని కోరారు.

హైదరాబాద్‌లో యమ్మీ బి విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ కేఫ్ చైన్ అయిన యమ్మీ బి హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో తమ తొమ్మిదవ స్టోర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ మైలురాయి బ్రాండ్ విస్తరణ వ్యూహంలో ఒక ముఖ్యమైన ముందడుగు సూచిస్తుందని యమ్మీ బి వ్యవస్థాపకులు సందీప్ జంగాల పేర్కొన్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి హైదరాబాద్‌లో 12 అవుట్ లెట్‌లు, బెంగళూరులో నాలుగు, ముంబయిలో నాలుగు అవుట్ లెట్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

12 మంది ఆర్ఎంపిలపై కేసులు

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 12 మంది ఆర్ఎంపిలపై కేసులు నమోదు చేసినట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తెలిపింది. ఈ మేరకు మంగళవారం కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ వైద్యం చేస్తుండటంతో హైదరాబాద్‌లో ఎనిమిది మంది, సంగారెడ్డిలో ముగ్గురు, దుండిగల్‌లో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్లలో ఎన్ఎంసి 34, 54, టిఎస్ఎంపిఆర్ చట్టం 22 ప్రకారం ఈ కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు.

సింబియాసిస్ వర్సిటీలో విద్యార్థి మృతి

- రంగారెడ్డి జిల్లా నందిగామలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని సింబియాసిస్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగింది. పోలీసులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన షాగ్నిక్ బాసు (22) యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటూ న్యాయశాస్త్రం మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బాత్‌రూమ్‌కి వెళ్ళిన షాగ్నిక్ ఎంతకీ బయటికి రాకపోవడంతో తోటి విద్యార్థులు కిటికీ లోంచి గమనించగా అపస్మారక స్థితిలో కిందపడి ఉన్నాడు. వెంటనే విద్యార్థులు కళాశాల సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని బాత్ రూమ్ తలుపులు పగులగొట్టి.. అతన్ని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. షాగ్నిక్‌ను వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియరాలేదు. యువసత్తా యూత్ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదుట యువకులు నిరసన తెలిపారు. విద్యార్థి మృతిపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ-2 ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ గ్రామానికి చెందిన మోత్కూరి కుమారస్వామి (35) తనకున్న మూడు ఎకరాల భూమిలో గత రెండేళ్లుగా పత్తి, మిర్చి పంట వేయగా దిగుబడి సరిగా రాలేదు. పెట్టిన పెట్టుబడి రాక చేసిన అప్పులు పెరిగి వాటిని ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున తన చేను వద్దకు పోయి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మోత్కూరి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రూ.85 కోట్ల బిల్లులను పాల రైతులకు చెల్లించాలి

- మదర్ డెయిరీ ఆస్తులను నష్టాల పేరుతో విక్రయించొద్దు
- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మదర్‌డెయిరీ నాలుగు బిల్లులు, విజయ డెయిరీ రెండు బిల్లుల బకాయి మొత్తం రూ.85 కోట్లు వెంటనే పాల రైతులకు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ సంబంధిత యాజమాన్యాలను డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద పాడి రైతులు మంగళవారం పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత రైతులకు పాడి పరిశ్రమ పెద్ద జీవనోపాధి వనరుగా ఉన్నదన్నారు. ఉపాధినిస్తున్న పాడి పరిశ్రమను ప్రభుత్వాలు క్రమానుగుణంగా నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేట్ సంస్థలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం వల్ల ప్రభుత్వ సంస్థలైన విజయడెయిరీ, మదర్‌డెయిరీలు నష్టాల్లోకి నెట్టివేయ బడుతున్నాయని తెలిపారు. విదేశాల నుంచి పాలను కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకోవడం వల్ల దేశీయ పాల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పాల ఉత్పత్తులపై సుంకాలను పెంచి దిగుమతులను అరికట్టాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో విస్తరించి ఉన్న మదర్‌డెయిరీ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థను గట్టెక్కించాలంటే దాని ఆస్తులను అమ్మాల్సి వస్తుందని డెయిరీ చైర్మన్ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. సంస్థలో అవినీతి పెరిగిపోవడం వల్లే నష్టాల పాలవుతున్నదని, రోజుకు లక్షా15 వేల లీటర్ల పాలను సేకరిస్తున్న యాజమాన్యం వ్యాపారం చేయడంలో విఫల మవడమే నష్టాలకు ప్రధాన కారణమని అన్నారు. నష్టాల్లో ఉన్న సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్స్ రూపంలో సహ కరించాలని కోరారు. అధికార యంత్రాంగం, సిబ్బంది సంస్థ లాభాల్లోకి వచ్చేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న తీగల సాగర్

విజయడెయిరీ ప్రభుత్వ సంస్థ అయినప్పటికీ 15 రోజులకు ఒకసారి ఇవ్వాల్సిన పాల బిల్లులను ఇవ్వకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రోజుకు మూడు లక్షల 50 వేల లీటర్ల పాలు సేకరించే సంస్థ, పాల ఉత్పత్తుల విక్రయాలను పకడ్బందీగా చేసి సంస్థను మరింత లాభాల్లోకి తీసుకురావాలని కోరారు. రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న లీటర్ పాలకు రూ. ఐదు చొప్పున చెల్లించాల్సిన అదనపు మొత్తాన్ని పాలరైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. పాల ఉత్పత్తికయ్యే ఖర్చులను, పెరుగుతున్న ఇతర ముడి సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకొని పాల రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజుగౌడ్, నాయకులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మంగ నరసింహులు, బూరుగు కృష్ణారెడ్డి, చీరిక అలివేలు, చీరిక సంజీవరెడ్డి, కందడి సత్తిరెడ్డి, కోట రామచంద్రారెడ్డి, బబ్బూరి పోశెట్టి, రాగిరి కిష్టయ్య, ర్యాకల శ్రీశైలం, రేసు రామచంద్రారెడ్డి, గన్నెబోయిన విజయభాస్కర్, బోయిన ఆనంద్, ఎదునూరిమల్లేశం, గాడి శ్రీనివాస్, పల్లెర్ల అంజయ్య, మచ్చ భాస్కర్, సిల్వేరు ఎల్లయ్య, భీమగాని రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం సురేశ్ ఎనలేని కృషి

- జెవివి ప్రధాన కార్యదర్శి రాజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజారోగ్య ఉద్యమ నిర్మాణంలో అనుమకొండ సురేశ్ ఎనలేని కృషి చేశారని జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా అన్నారు. ప్రజలందరికీ ప్రభుత్వ వైద్యం అందించేందుకు నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆరోగ్య సబ్ కమిటీ రాష్ట్ర మాజీ కన్వీనర్ సురేశ్ ప్రథమ వర్ధంతిని జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వరప్రసాద్ అధ్యక్షతన హైదరాబాదులో నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర నాయకత్వం, కుటుంబ సభ్యులు, బంధువులు సురేశ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాజా మాట్లాడుతూ పేదలందరికీ వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యతనీ, దాని సాధన కోసం సురేశ్ ఎంతగానో పోరాడారని గుర్తు చేశారు. వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యతరగతి, సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో లేదని విమర్శించారు. వైద్యాన్ని "కొనలేక" చాలా మంది పేదలు జీవితాన్ని అర్ధాంతరంగా ప్రాణాలు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కూడా కార్పొరేట్ శక్తులకే వంత పాడుతున్నాయనీ, పేదలందరికీ ఉచిత వైద్యం అందించే బాధ్యతల నుంచి క్రమంగా తప్పుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఉచితంగా ప్రభుత్వ వైద్యం అందించేందుకు సైన్స్ కార్యకర్తలు కృషి చేయడమే సురేశ్‌కు ఘనమైన నివాళి అని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెవివి ప్రధాన కార్యదర్శి రాజా

జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ సురేశ్ తన జీవితాంతం పేదల వైద్యం కోసం నిస్వార్థంగా సేవ చేశారని చెప్పారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వరప్రసాద్ మాట్లాడుతూ అనేక ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు సురేశ్ చేసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా సురేశ్ కుటుంబ సభ్యులు, బంధువులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు సురేశ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సురేశ్ సతీమణి గీత, కూతురు సునయన, అల్లుడు లోక్‌నాథ్ ప్రజా సైన్స్ ఉద్యమానికి తమ వంతు సహకారంగా రూ.ఒక లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శ్రీనాథ్, డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, ఎస్పీ లింగస్వామి, ఆనంద్ కుమార్, నాగరాజు, జేవీవీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బురాన్, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జిన్నంవార్ శంకర్ ఏసీబీకి చిక్కారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికల) భవనం నిర్మాణానికి మంజూరైన రూ.2కోట్ల బిల్లు ఇచ్చేందుకు డిప్యూటీ ఎగ్జికూటీవ్ ఇంజనీర్ జిన్నంవార్ శంకర్ కాంట్రాక్టర్‌ను రూ. రెండు లక్షలు లంచం అడిగారు. ఆ తర్వాత బాధితుడి అభ్యర్థన మేరకు రూ.లక్ష తగ్గించాడు. ఈ క్రమంలో మొదటి దఫా రూ. 50 వేలు ఇచ్చేందుకు ఒప్పుకోగా బాధితుడు ఎసిబిని ఆశ్రయించారు. మంగళవారం మైనార్టీ స్కూల్‌లో నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. డీఈఈని అరెస్టు చేసి కరీంనగర్ ఎసిబి కోర్టుకు తరలించారు.

50 ఏళ్ల మధురానుభూతి

- పట్టాభిపురం స్కూల్ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - హైదరాబాద్

గుంటూరు పట్టాభిపురం మున్సిపాల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 1964-75 మధ్య చదివిన విద్యార్థులు హాజరయ్యారు. చాలా మంది 50 ఏళ్ల తర్వాత కలిసినట్లు వారు తెలిపారు. చిన్ననాటి జ్ఞాపకాలు, చేసిన అల్లరి పనులు గుర్తుకు తెచ్చుకొని అందరూ తమ తమ అనుభవాలను పంచుకున్నారు. వారి గురువులు రఘువేంద్రరావు, స్వరాజ్య లక్ష్మీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు.

కానిస్టేబుల్‌పై కత్తితో దొంగ దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్‌పై అంతర్రాష్ట్ర దొంగ ఒకరు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుల్ నరేశ్ స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో నిఘాలో ఉండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించారు. పట్టుకుందామని దగ్గరకు వెళ్లేలోపే గమనించిన సదరు వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. అతన్ని వెంబడించి వేంసూరు రోడ్డు శివారులోని శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయం వద్ద కానిస్టేబుల్ అడ్డగించారు. దాంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో సదరు వ్యక్తి నాలుగు చోట్ల కానిస్టేబుల్‌ను తీవ్రంగా గాయపర్చి పరారయ్యాడు. గమనించిన స్థానికులు నరేశ్‌ను 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. కానిస్టేబుల్ నరేశ్‌పై దాడికి పాల్పడింది ఏపీలోని చాట్రాయి మండలం చిత్తాపూర్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగ తిరువీధుల సురేందర్‌గా పోలీసులు గుర్తించారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని స్థానిక పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. పోలీసు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డైట్ చార్జీల బకాయిలు విడుదల చేయండి

- సిఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డైట్, ఇతర చార్జీలు రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.96 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం (బిఎఎస్) ద్వారా ఎస్‌సి, ఎస్‌టి పేద పిల్లలను జిల్లాల్లో గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం చదివిస్తున్నదని వివరించారు. ఈ స్కీం 1990 నుంచి కొనసాగుతున్నదని గుర్తు చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రయివేటు విద్యాసంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు వంటి వాటిని విద్యాసంస్థలే సమకూరుస్తున్నాయని తెలిపారు. మెరిట్ లేకున్నా, ప్రవేశ పరీక్ష పెట్టకుండా నేరుగా లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రయివేటు విద్యాసంస్థల్లోకి రాష్ట్ర ప్రభుత్వం పంపుతున్నదని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా వాటిని అధిగమించి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని వివరించారు. ఒక్కో విద్యార్థికి గురుకులాల్లో ఏడాదికి రూ.42 వేలు, డేస్కాలర్‌కు రూ.28 వేల చొప్పున చెల్లిస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది పేద ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఈ పథకం కింద విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏడాదికి మూడు దఫాలుగా ప్రయివేటు విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం డైట్, ఇతర చార్జీలను సుమారు రూ.96 కోట్లు బకాయిలున్నట్టు తెలుస్తున్నదని వివరించారు. ప్రభుత్వానికి దళిత, గిరిజన విద్యార్థి సంఘాలతోపాటు ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అనేకసార్లు విన్నవించుకున్నా ఇంత వరకు చెల్లించడం లేదని తెలిపారు. ఈ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెల్లించేంత వరకు తల్లిదండ్రులే ఫీజులను చెల్లించాలంటూ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారనీ, చదువులను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదముందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.96 కోట్ల బకాయిలను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏజెన్సీ గ్రామాల్లో నీటి ఎద్దడి

- వాగుల్లోని చెలమల నీరే గతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంవత్సరాలు గడిచినా... ప్రభుత్వాలు మారినా ఏజెన్సీ గ్రామాల్లో మాత్రం నీటి ఎద్దడి తీరడం లేదు. వేసవికాలం ప్రారంభమైందంటే తాగు నీటి కోసం గిరిజనులు, గిరిజనేతరులు అరిగోస పడాల్సిందే. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని గిరిజన గ్రామాలైన చలపాక, బానాజీ బందం, ఎలిశెట్టిపల్లి, అల్లవారి గణపురంతోపాటు గొత్తి కోయగూడాలైన పులుకమ్మ వాగు, గుర్రాలబావి, గంటల గుంట, గుండెంగవాయి గ్రామాలన్నీ వాగు తీరం ఒడ్డు వెంబడి ఉంటాయి. ఈ గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో బోర్లు వేసుకోవడానికి అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ అనుమతులిచ్చినా ఊరికి ఒకటో రెండు బోర్లు మాత్రమే వేసుకోవాల్సి ఉంటుంది. ఈ బోర్లలోని నీరు చిలుము వాసనగా ఉంటుంది. ఇతర అవసరాలకు తప్ప తాగడానికి పనిచేయవు. ఒక్క ఊరికి సుమారు 150 నుంచి 200 మంది జనాభా ఉంటారు. వేసవి కాలం మొదలైతే ఈ ఊర్లో ఉన్న చెరువు నీరు కూడా అడగంటి పోతుంది. దాంతో గిరిజనులు, గిరిజనేతరులందరూ పిల్లాపాపలతో వారి సమీపాన ఉన్న వాగు నీటిపై ఆధారపడతారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం సమయంలో వాగుల్లోకి వెళ్లి చలమలు తీసి ఆ నీటిని తెచ్చుకుంటున్నారు. మార్చి, ఏప్రిల్, మే ఈ మూడు నెలలు మాత్రం వారికి నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. వేసవిలో గిరిజనులు ఆ వాగుల్లో నీటిని జీవనాధారంగా భావిస్తారు. సంవత్సరాలుగా నీటి ఎద్దడి ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఏజెన్సీ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ప్రాణం తీసిన లిఫ్ట్

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం (58) ప్రమాదవశాత్తు లిఫ్టులో మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఓ అపార్టుమెంట్‌లో లిఫ్ట్ వచ్చిందనుకుని డోర్ ఓపెన్ చేసి లోపలికి అడుగుపెట్టడంతో మూడో ఫ్లోర్ నుంచి ఒకటో ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై ఆయన పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే గంగారాం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గంగారాంకు భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగారాం కమాండెంట్‌గా 17వ పోలీస్ బెటాలియన్‌కు రాకముందు తెలంగాణ సచివాలయంలో సీఎస్‌ఓగా పని చేశారు. కమాండెంట్ గంగారాం భౌతిక కాయానికి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఎఎస్‌పి చంద్రయ్య, డిఎస్‌పి చంద్రశేఖరరెడ్డి, 1వ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, 3వ బెటాలియన్ కామండెంట్ జమీల్ ఫాష, 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది గంగారం మృతదేహానికి నివాళులు అర్పించారు.

సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంతాపం వ్యక్తం చేశారు.